మరో 434మంది నర్సుల క్రమబద్ధీకరణ

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 2021 బ్యాచ్‌కు చెందిన మరో 434 మంది నర్సుల సర్వీస్ క్రమబద్ధీకరణ ప్రక్రియను వైద్యారోగ్య శాఖ ప్రారంభించింది. 2,418 మంది నర్సుల్లో కేవలం 27 మందికి చెందిన సర్వీస్‌ను క్రమబద్ధీకరించి, మిగతావారిని నిర్లక్ష్యం చేయడంపై ఈ నెల 27న 'నమస్తే తెలంగాణ'లో 'డీపీహెచ్‌లో జిల్లాకో న్యాయం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై వైద్యారోగ్య శాఖ తక్షణం స్పందించింది. మరో 434 మంది నర్సుల సర్వీస్‌ను క్రమబద్ధీకరించే ప్రక్రియను అదేరోజు ప్రారంభించింది. పోలీస్ వెరిఫికేషన్ పూర్తయ్యి నివేదికలు అందినవారి వివరాలతో జాబితాను విడుదల చేసింది. ఆయా అభ్యర్థుల సర్వీస్ వివరాలను అందజేయాలని అన్ని మెడికల్ కాలేజీల సూపరింటెండెంట్లు, దవాఖానల డైరెక్టర్లకు లేఖలు రాసింది. ఈ మేరకు డీపీహెచ్ కార్యాలయంలోని నర్సింగ్ విభాగం హెడ్ శ్వేత మొంగా ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ వెరిఫికేషన్ పూర్తయ్యి, నివేదికలు అందిన తర్వాత మిగతా అభ్యర్థుల ఉద్యోగాలను కూడా క్రమబద్ధీకరిస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థులు సంబురాలు చేసుకొంటున్నారు. 'నమస్తే తెలంగాణ'కు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

నమస్తే ఎఫెక్ట్

ఏం జరిగిందంటే..

2021 జూలైలో ప్రభుత్వం 2,418 మంది స్టాఫ్ నర్సులను నియమించింది. సుమారు 800 మంది డీఎంఈ పరిధిలో, మిగతావారు డీపీహెచ్ పరిధిలో పనిచేస్తున్నారు. వీరు రెండేండ్ల పాటు ప్రొబేషనరీ కాలంలోనే పనిచేయాలనే నిబంధన ఉన్నది. ఆ తర్వాత వారి సర్వీస్‌ను క్రమబద్ధీకరించాల్సి ఉంటుంది. ఈ బాధ్యత డీపీహెచ్ కార్యాలయానిది. నిరుడు ఆగస్టు నాటికే వారి రెండేండ్ల ప్రొబెషనరీ కాలం ముగిసింది. ఆ తర్వాత వారి సర్వీస్ క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ మేరకు పోలీస్ వెరిఫికేషన్ కూడా పూర్తయింది. డీపీహెచ్ కార్యాలయంలోని నర్సింగ్ సెక్షన్ సిబ్బంది వాటిని పరిశీలించి వారి సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుంది. అయితే, మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో పనిచేస్తున్న 27 మంది స్టాఫ్ నర్సులను మాత్రమే రెగ్యులరైజ్ చేసి మిగతా వారిని పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురించగా, ప్రభుత్వం స్పందించింది.

రైల్వేలో సమ్మె సైరన్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): పాత పెన్షన్ అమలు చేయాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మే 1 నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్టు ఎస్‌సీఆర్ మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ శంకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీలోని జేఎఫ్‌ఆర్‌వోపీఎస్‌లోని అన్ని సంఘాలు సమ్మె నోటీసు ఇవ్వాలని ఈ నెల 19న నిర్ణయించినట్టు తెలిపారు.

ఢిల్లీలో కార్ల చోరీ.. ఓఎల్ఎక్స్‌లో విక్రయం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ ఇతర రాష్ట్రాల్లో దొంగిలించిన కార్లను ఓఎల్ఎక్స్ ద్వారా తక్కువ ధరకు అమ్ముతున్న ఘరానా ముఠాను సీసీఎస్ స్పెషల్ జోనల్ టీమ్ అరెస్ట్ చేసింది. వారి వద్ద నుంచి రూ.3.5 కోట్ల విలువైన 12 కార్లను స్వాధీనం చేసుకుంది. సీసీఎస్ డీసీపీ శ్వేత కథనం ప్రకారం.. కార్తీక్, షేక్ అబ్దుల్లా, మహ్మద్ ఫిరోజ్, షేక్ షాహిద్‌అలీ, గాంధీ శివకుమార్, లవన్‌కుమార్, మహ్మద్ తౌసిఫ్ ఓఎల్ఎక్స్‌లో తక్కువ ధరకు కార్ల గురించి సెర్చ్ చేస్తున్నారు. ఈ క్రమంలో మదన్‌పల్లికి చెందిన సోను, సైఫ్ అలీ, బెంగళూరుకు చెందిన సయ్యద్‌లు.. కార్తీక్‌ను ఫోన్‌లో సంప్రదించి ఒప్పందం ప్రకారం కార్లను డెలివరీ చేశారు. వాహనాల తనిఖీల్లో గుట్టు బయటపడింది. ఆరుగురిని ఈ నెల 20న అరెస్ట్ చేసిన పోలీసులు తాజాగా లవన్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. కార్లను దొంగిలిస్తున్న ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఎనిమిదిమంది దుర్మరణం

- కూలీల ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఐదుగురు..
- బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృత్యువాత
- సూర్యాపేట, సిద్దిపేట జిల్లాల్లో విషాద ఘటనలు

కాల్వలోకి దూసుకుపోయిన కారు

మోతె/సిద్దిపేట, ఫిబ్రవరి 28: సూర్యాపేట, సిద్దిపేట జిల్లాల్లో బుధవారం జరిగిన రెండు ఘోర రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది దుర్మరణం చెందారు. మిరప కూళ్లకు వెళ్తున్న కూలీల ఆటోపైకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లిన ఘటనలో ఐదుగురు, కారు బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. సూర్యాపేట జిల్లా మునగాల మండలం విజయరాఘవాపురానికి చెందిన చెవుల నారాయణమ్మ (50), కందుల నాగమ్మ (50), కందుల గురవయ్య (50), రెమిడాల సౌభాగ్యమ్మ (60), రేపాలకు చెందిన పోకల అనసూర్య (50) మరికొందరు కూలీలతో కలిసి మోతె మండలం హుస్సేనాబాద్‌కు మిరప కూళ్లకు ఆటోలో బయల్దేరారు. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి వెంట కేశవాపురం అండర్‌పాస్ బ్రిడ్జి వద్దకు చేరుకోగానే.. ఖమ్మం నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న మధిర డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు కూలీల ఆటోపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో నారాయణమ్మ, నాగమ్మ, సౌభాగ్యమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో సూర్యాపేట ఏరియా దవాఖానకు తరలించారు. వారిలో అనసూర్య మరణించింది. గురవయ్య పరిస్థితి మరింత విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా మార్గమధ్యలో మృతిచెందాడు. మరో కూలీ లక్ష్మి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాద సమయంలో ఆటోలో 12 మంది కూలీలు ఉండగా.. ఆరుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మరో ఘటనలో.. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం దుద్దెడకు చెందిన అనిల్.. కుటుంబంతో కలిసి కారులో హుస్నాబాద్‌లో వివాహానికి హాజరయ్యాడు. తిరుగు ప్రయాణంలో రాంపూర్ క్రాసింగ్ వద్దకు రాగానే కారు బైక్‌ను ఢీకొట్టగా బైకుపై వెళ్తున్న ఇద్దరితోపాటు కారులో ఉన్న కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన జక్కుల మమత అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న మరో 9 మందికి తీవ్ర గాయాలయ్యాయి. సిద్దిపేట జనరల్ దవాఖానలో చికిత్స పొందుతూ నంగునూరు మండలం బద్దిపడగకు చెందిన కట్టె రవి, నాగరాజుపల్లికి చెందిన ఐలయ్య పరిస్థితి విషమించి చనిపోయారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపారు.

అక్షయపాత్ర సేవలు అమోఘం

సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ

అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్ షెడ్‌ను పరిశీలిస్తున్న జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు

కంది, ఫిబ్రవరి 28: అక్షయపాత్ర ఫౌండేషన్ మంచి లక్ష్యంతో సమాజానికి అందిస్తున్న సేవలు అమోఘమని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ కొనియాడారు. అందరి ఆకలి తీరుస్తూ అండగా నిలుస్తున్న అక్షయపాత్ర ఫౌండేషన్ భవిష్యత్తులో మరిన్ని విజయ శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలోని అక్షయ పాత్ర ఫౌండేషన్ 15వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ.. అక్షయ పాత్ర ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు కావాల్సిన పోషకాహారాన్ని అందిస్తూ, ఆ లోపాన్ని తొలగిస్తున్నదని అభినందించారు. అక్షయపాత్ర ఫౌండేషన్ వంటి లాభాపేక్ష లేని సంస్థలను ప్రోత్సహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. తనవంతుగా అక్షయపాత్రకు ఎన్వీ రమణ రూ.2 లక్షల చెక్కును అందజేశారు. యంత్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో అక్షయ పాత్ర ఫౌండేషన్ చైర్మన్ మధు పండిత దాస, హైదరాబాద్ ట్రస్టీ, ప్రాంతీయ అధ్యక్షుడు సత్యగౌర చంద్ర పాల్గొన్నారు.

'ధాన్యం నిందితుల' అరెస్టు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 28: వడ్ల దొంగతనం కేసులో మరో ఏడుగురు నిందితులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ మేరకు వనపర్తి సీఐ నాగభూషణ్‌రావు వివరాలు వెల్లడించారు. ఈ నెల 24న వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం పెద్దదగడ గ్రామ శివారులోని మిల్లులో ధాన్యం మాయమైన ఘటన తెలిసిందే. ఈ ఘటనపై వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేసి పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన ఏడుగురు నిందితులను ఇప్పటికే రిమాండ్‌కు తరలించామని, తాజాగా మరో ఏడుగురు నిందితులు రాంబాబు, పవన్‌కళ్యాణ్, అభిషేక్‌రెడ్డి, స్వామి, మల్లేశ్, శివశంకర్, యాదగిరిని పెద్దకొత్తపల్లి క్రాస్ రోడ్డు వద్ద అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్టు చెప్పారు. వారి నుంచి రూ.5.50 లక్షల నగదు, 13 మొబైల్ ఫోన్లు, ఏడు వాహనాలను సీజ్ చేసినట్టు తెలిపారు.

ఏసీబీ కస్టడీకి నలుగురు అధికారులు

- 3 రోజులు అప్పగిస్తూ ఏసీబీ కోర్టు ఆదేశాలు

నాంపల్లి కోర్టులు, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టించి, అవినీతికి పాల్పడిన నలుగురు అధికారులను ఏసీబీ కస్టడీలోకి తీసుకొన్నది. బుధవారం ఏసీబీ కోర్టు జడ్జి ఆదేశాల మేరకు అధికారులను మూడు రోజుల పాటు ఏసీబీ కస్టడీలోకి తీసుకొన్నది. గురువారం ఈ నలుగురు అధికారులను జైలు నుంచి ఏసీబీ కార్యాలయానికి తరలిస్తారు. కామారెడ్డి పశువుల దవాఖాన అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ధర్మపురి రవి, మేడ్చల్ అసిస్టెంట్ డైరెక్టర్ ముంత ఆదిత్యకేశవ సాయి, రంగారెడ్డి జిల్లా గ్రౌండ్‌వాటర్ ఆఫీసర్, అసిస్టెంట్ డైరెక్టర్ పసుల రఘుపతిరెడ్డి, నల్లగొండ వయోజన విద్యాధికారి సంగు గణేశ్ నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు కస్టడీకి అప్పగించాలని పీపీ కోర్టుకు విన్నవించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) వాదనలను ఏకీభవించిన కోర్టు విచారణకు అనుమతిచ్చారు. ప్రధాన నిందితులు సయ్యద్ మోయినుద్దీన్, సయ్యద్ ఇక్రముద్దీన్ విదేశాల్లో ఉన్నట్టు ప్రాథమిక సమాచారం ఉన్నదని అధికారులు తెలిపారు. ఏజెంట్లుగా వీరిద్దరి పాత్ర కీలకంగా ఉండటంతో అరెస్టుకు రంగం సిద్ధం చేయనున్నారు. 2.10 కోట్ల దుర్వినియోగంపై నలుగురి అధికారుల వాంగ్మూలాలను నమోదు చేసుకొన్న అనంతరం ఈ కేసుతో సంబంధం ఉన్న మరికొందరిని అదుపులోకి తీసుకోనున్నారు. అరెస్టులు పెరిగే అవకాశం ఉన్నది.

డిస్చార్జి పిటిషన్లను ఏప్రిల్ 30లోగా పరిష్కరించాలి

- జగన్ ఆస్తుల కేసుల్లో గడువు పొడిగించిన హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 28, (నమస్తే తెలంగాణ): ఆదాయానికి మించి ఆస్తులను కూడబెట్టారన్న అభియోగాలతో ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు మరికొందరు ఇతరులపై సీబీఐ నమోదు చేసిన కేసులకు సంబంధించి నిందితులు దాఖలు చేసుకున్న డిస్చార్జి పిటిషన్లను ఏప్రిల్ 30లోగా పరిష్కరించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టీ వినోద్‌కుమార్ ధర్మాసనం ఇటీవల హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టుకు ఉత్తర్వులు జారీచేసింది. 20 కేసుల్లోని నిందితుల డిస్చార్జి పిటిషన్లను 2 నెలల్లోగా తేల్చాలని హైకోర్టు నిరుడు డిసెంబర్ 15నే ఆదేశించింది. కానీ, ఈడీ, సీబీఐ నమోదు చేసిన కేసుల్లో చాలామంది నిందితులు ఉన్నారని, డిస్చార్జి పిటిషన్ల పరిష్కారానికి మరింత సమయం అవసరమవుతుందని సీబీఐ కోర్టు అదే తేదీన హైకోర్టు రిజిస్ట్రీకి లేఖ రాసింది. డిస్చార్జి సిటిషన్లపై విచారణ దాదాపు పూర్తయిందని, దీనికి సంబంధించిన 13 వేల పేజీలు సిద్ధం చేశామని. రికార్డులు పెద్ద అత్యధిక సంఖ్యలో ఉన్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో గడువు ఏప్రిల్ 30 వరకు పొడిగించాలని సీబీఐ కోర్టు కోరడంతో అందుకు హైకోర్టు అంగీకరించింది.

తెలంగాణ యువశక్తి పార్టీకి చుక్కెదురు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఉమ్మడి గుర్తును పొందడం ప్రాథమిక హక్కు కాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళితోపాటు ప్రజాప్రాతినిధ్య చట్టం కింద మాత్రమే ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలకు గుర్తులను కేటాయిస్తుందని తెలిపింది. రానున్న ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులకు ఉమ్మడి గుర్తును కేటాయించేలా కేంద్ర ఎన్నికల సంఘానికి ఉత్తర్వులు జారీ చేయాలంటూ తెలంగాణ యువశక్తి పార్టీ అధ్యక్షుడు బీ రామ్మోహన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

వయోపరిమితి పెంపుపై నాలుగు వారాల్లో నిర్ణయం

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చేపట్టబోయే ఉద్యోగ నియామకాలకు వయోపరిమితిని 46 నుంచి 51 ఏండ్లకు పెంచాలని కోరుతూ పలువురు అభ్యర్థులు సమర్పించిన వినతిపత్రాన్ని పరిశీలించి 4 వారాల్లోగా తగిన నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. గ్రూప్-1 సర్వీసు పోస్టులకు ఫిబ్రవరి 19న జారీచేసిన చేసిన నోటిఫికేషన్‌తోపాటు ముున్ముందు వెలువరించే ఇతర ఉద్యోగ నోటిఫికేషన్లలో కూడా అభ్యర్థుల వయోపరిమితిని పెంచాలంటూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ పుల్లా కార్తీక్ బుధవారం విచారణ చేపట్టారు. రాష్ట్రంలో 2017 నుంచి ఎలాంటి ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల కాలేదని, ఈ నేపథ్యంలో అభ్యర్థుల వయోపరిమితిని పెంచాలని కోరుతూ ఈ నెల 2న ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించామని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. దీంతో పిటిషనర్ల వినతిని పరిష్కరించాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఉత్తర్వులు జారీచేసిన హైకోర్టు.. ఈ పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నట్టు ప్రకటించింది.

ఎన్.శంకర్ నిర్మాణంలో చారిత్రక వెబ్‌సిరీస్‌లు

సినిమాలకు సామాజిక ప్రయోజనంతో పాటు ప్రజాహితం పరమార్థంగా ఉండాలని విశ్వసించే దర్శకుల్లో ఎన్.శంకర్ ఒకరు. వాణిజ్య అంశాలు కలబోసిన స్ఫూర్తివంతమైన కథాంశాలతో తెలుగు చిత్రసీమపై తనదైన ముద్రను వేశారాయన. తాజాగా ఆయన చారిత్రక ఘటనలతో మూడు వెబ్‌సిరీస్‌లను తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎన్.శంకర్ టీవీ అండ్ ఫిల్మ్ స్టూడియో పతాకంపై ఆయన నిర్మాతగా, దర్శకత్వ పర్యవేక్షణలో ఈ సిరీస్‌లు రూపొందనున్నాయి. ఈ సిరీస్‌లకు సంబంధించిన వివరాలను ఎన్.శంకర్ తెలియజేస్తూ 'తెలంగాణ సాయుధ పోరాటం నుంచి తెలంగాణ రాష్ట్ర సాకారం వరకు చోటుచేసుకున్న చారిత్రక ఘటనలు, జరిగిన ప్రజా ఉద్యమాల నేపథ్యంలో తొలి సిరీస్‌ను తెరకెక్కిస్తాం. అక్టోబర్‌లో షూటింగ్‌ను మొదలుపెడతాం. ఇక రెండవ సిరీస్‌లో సామాజిక ఉద్యమకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే జీవితంలో జరిగిన సంఘటనలు, అణగారిన ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాన్ని చూపించబోతున్నాం. భారత రాజ్యాంగ శిల్పి బాబా సాహెబ్ అంబేద్కర్ జీవిత సంఘర్షణ, సమాజంలోని అసమానతలను రూపుమాపడానికి ఆయన చేసిన కృషిని దృశ్యమానం చేస్తూ మూడో వెబ్‌సిరీస్‌ను రూపొందించబోతున్నాం' అని తెలిపారు. అయితే మహాత్మ జ్యోతిరావు పూలే, బాబా సాహెబ్ అంబేద్కర్ వెబ్‌సిరీస్‌లు బయోగ్రఫీలు కాదని, లక్ష్య సాధనలో వారి స్ఫూర్తిదాయక పోరాటాన్ని ఆవిష్కరిస్తాయని, ఈ మూడు వెబ్‌సిరీస్‌లను తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కిస్తామని ఎన్.శంకర్ తెలిపారు.

హారర్ చిత్రాల్లో సరికొత్త ప్రయోగం

శివ కందుకూరి హీరోగా పురుషోత్తం రాజ్ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'భూతద్దం భాస్కర్ నారాయణ'. స్నేహాల్, శశిధర్ నిర్మిస్తున్నారు. మార్చి 1న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. దర్శకుడు మాట్లాడుతూ 'పదేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నాను. ఈ సినిమాతో నా కల నెరవేరింది. దిష్టిబొమ్మ నేపథ్యంలో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే కథ ఇది. హారర్ సినిమాల్లో సరికొత్తగా ఉంటుంది. ప్రతి క్షణం అనూహ్య మలుపులతో భయాన్ని రేకెత్తిస్తుంది' అన్నారు. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్‌కు అద్భుతమైన స్పందన లభించిందని, గీతా డిస్ట్రిబ్యూషన్ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తుందని హీరో శివ కందుకూరి తెలిపారు. మంచి సబ్జెక్ట్ ఇదని, ఎక్కడా రాజీపడకుండా తెరకెక్కించారని రాజ్ కందుకూరి అన్నారు. ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ అందించే చిత్రమిదని, హారర్ సబ్జెక్ట్స్‌లో ఇదొక ప్రయోగంగా నిలిచిపోతుందని నిర్మాతలు స్నేహాల్, శశిధర్ పేర్కొన్నారు.

భారతరత్న పీవీ నరసింహారావు బయోపిక్

భారత మాజీ ప్రధాని, బహుముఖ ప్రజ్ఞాశాలి, ఆర్థిక సంస్కరణలతో నవభారత రూపశిల్పిగా వినుతికెక్కిన పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన జీవిత చరిత్ర వెబ్‌సిరీస్‌గా రానుంది. ఆహా స్టూడియో, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు పీవీ నరసింహారావు బయోపిక్ 'హాఫ్ లయన్'ను తెరకెక్కిస్తున్నట్లు గతంలోనే ప్రకటించాయి. ఇటీవల పీవీకి భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో ఈ సిరీస్‌పై మరింత కసరత్తులు చేస్తున్నట్లు నిర్మాణ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రముఖ రచయిత వినయ్ సీతాపతి రచించిన 'హాఫ్ లయన్' పుస్తకం ఆధారంగా, సీనియర్ దర్శకుడు ప్రకాష్ ఝా ఈ సిరీస్‌ను రూపొందించబోతున్నారు. ఈ పాన్ ఇండియా సిరీస్ ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని, హిందీ..తెలుగు భాషల్లో విడుదల చేయబోతున్నామని, పీవీ నరసింహారావు జీవనయానాన్ని ఈ సిరీస్‌లో కళ్లకు కట్టినట్లుగా చూపించబోతున్నామని దర్శకుడు తెలిపారు. ఈ సిరీస్‌కు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించబోతున్నారు.

చిత్రం

అద్భుత దృశ్యకావ్యంగా 'కన్నప్ప'



శ్రీకాళహస్తి స్థల పురాణం ఆధారంగా విష్ణు మంచు రూపొందిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ఆయన టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ సినిమాలో మోహన్‌లాల్, మోహన్‌బాబు, ప్రభాస్ వంటి అగ్ర తారలు భాగమవుతున్నారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకుడు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఇదివరకే న్యూజిలాండ్‌లోని సుందరమైన లొకేషన్లలో 90 రోజుల పాటు తొలి షెడ్యూల్ చిత్రీకరణ జరిగింది. తాజాగా చిత్ర బృందం రెండో షెడ్యూల్‌ను మొదలుపెట్టింది. ఈ సందర్భంగా మంచు విష్ణు సోషల్‌మీడియాలో ఓ వీడియోను షేర్ చేశారు. 'న్యూజిలాండ్, థాయ్‌లాండ్, భారత్‌కు చెందిన అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు ఈ సినిమా కోసం పనిచేస్తున్నారు. ఈ రెండో షెడ్యూల్‌లో ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక ఘట్టాలను తెరకెక్కిస్తాం. ఓ అద్భుత దృశ్యకావ్యంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం' అని మంచు విష్ణు పేర్కొన్నారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై ఈ సినిమా తెరకెక్కుతున్నది.

పెళ్లి వార్తలపై స్పందించను

తన పెళ్లి గురించి సోషల్‌మీడియాలో వస్తున్న పుకార్లపై ఆగ్రహం వ్యక్తం చేసింది అగ్ర కథానాయిక తాప్సీ. మార్చి నెలాఖరున రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వివాహం చేసుకోనుందని ప్రచారం జరుగుతున్నది. ఈ వార్తలపై తాప్సీ స్పందించింది. 'ఇలాంటి వార్తలను ఎందుకు ప్రచారం చేస్తారో అర్థం కాదు. నా వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వ్యవహారాలపై సోషల్‌మీడియా వేదికగా స్పందించడం నాకు ఇష్టం ఉండదు. అందుకే ఈ విషయంపై ఏం మాట్లాడదలచుకోలేదు. భవిష్యత్తులో కూడా ఇలాంటి వార్తలపై స్పందించను' అంటూ సమాధానమిచ్చింది. దీంతో ఈ అమ్మడి పెళ్లి వార్తలకు చెక్ పడ్డట్లయింది. డెన్మార్క్‌కు చెందిన బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్ బోతో తాప్సీ గత కొన్నేళ్లుగా ప్రేమాయణాన్ని సాగిస్తున్నది. వీరిద్దరు కలిసి పలు ప్రైవేట్ కార్యక్రమాలకు హాజరైన ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. పదేళ్ల నుంచి అతనితో ప్రేమలో ఉన్నట్లు తాప్సీ గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. అయితే పెళ్లి విషయంపై మాత్రం స్పందించడానికి అనేక సందర్భాల్లో నిరాకరించింది. ప్రస్తుతం తాప్సీ హిందీలో 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబా' చిత్రంలో నటిస్తున్నది.

పురాణాల నేపథ్య కథ

వినోద్‌వర్మ, సూర్య పురిమెట్ల, అనసూయ, సాయికుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'అరి'. జయశంకర్ దర్శకుడు. శ్రీనివాస్ రామిరెడ్డి, తిమ్మప్ప నాయుడు, శేషు మారంరెడ్డి నిర్మాత. ఈ సినిమాలో కీలక పాత్రను పోషించిన వినోద్‌వర్మ ఫస్ట్‌లుక్‌ను బుధవారం విడుదల చేశారు. ఓ పెద్ద లైబ్రరీలో ఏవో నోట్స్ రాసుకుంటూ ఆలోచనలో మునిగిపోయిన ఆయన లుక్ ఆసక్తిగా అనిపిస్తున్నది. 'తెలుగు తెరపై ఇప్పటివరకు రానటువంటి వినూత్న కథాంశమిది. భారత పురాణాలను టచ్ చేస్తూ ఫాంటసీ అంశాలతో ఆకట్టుకుంటుంది. తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కృష్ణప్రసాద్, సంగీతం: అనూప్‌రూబెన్స్, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవ్ నాయర్, సమర్పణ: ఆర్.వీ.రెడ్డి, రచన-దర్శకత్వం: జయశంకర్.

రియల్ హీరోస్ కథ ఇది

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా శక్తిప్రతాప్‌సింగ్ హడా దర్శకత్వంలో రూపొందిన 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రం మార్చి 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు సిద్ధు ముద్దా, నందకుమార్ అబ్బినేని బుధవారం పాత్రికేయులతో ముచ్చటిస్తూ ''ఫైటర్' తర్వాత ఎయిర్‌ఫోర్స్ నేపథ్యంలో భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కిన చిత్రమిది. దర్శకుడు శక్తిప్రతాప్‌కు వీఎఫ్ఎక్స్ నేపథ్యం ఉంది. దాంతో సినిమాను అద్భుతంగా తీశాడు. గ్వాలియర్ ఎయిర్‌బేస్‌లో ప్రత్యేక అనుమతులు తీసుకొని ఈ సినిమా షూటింగ్ చేశాం. అందుకే ఎయిర్‌బేస్ విజువల్స్ చాలా నేచురల్‌గా, గ్రాండ్‌నెస్‌తో కనిపిస్తాయి' అన్నారు. ఎయిర్‌ఫోర్స్ అధికారులు ఈ సినిమా చూసిన తర్వాత ఎంతగానో ప్రశంసించారని, ఏం చెప్పారో అదే తీశారని మెచ్చుకున్నారని వారు తెలిపారు. 'రియల్ ఎయిర్‌బేస్‌లో షూట్ చేయడం ఓ డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్. దేశరక్షణలో సైనికుల త్యాగాలను, ధైర్యసాహసాలను స్మరించుకుంటూ..వారి పోరాటాన్ని ప్రేక్షకులకు చూపించాలనే లక్ష్యంతో